కాంగ్రెస్ కార్నర్ మీటింగా.. క్రాక్ షోనా?

- ఎర్రవల్లి వద్ద జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు
- అధికార పార్టీకి నిబంధనలు వర్తించవా అంటున్న స్థానికులు

రోడ్‌షోలో పాల్గొని మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

అలంపూర్, ఏప్రిల్ 16: రోడ్లపై వెళ్లే వాహనాలకు అనుమతులు లేకుండా అంతరాయం కల్పించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికార యంత్రాంగం అధికార పార్టీ నాయకులు ఎంపీ ఎన్నికల నేపథ్యంలో కార్నర్ మీటింగ్ పేరుతో అలంపూర్ నియోజకవర్గంలోని ఎర్రవల్లిచౌరస్తా వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఏకంగా రోడ్ షో నిర్వహించి జాతీయ రహదారిపై వెళ్లే వందల వాహనాలకు ఆటంకం కల్పించారు. సాధారణ ప్రజలు, విపక్ష పార్టీలు ఎవరైనా రహదారులపై నిరసనలు వ్యక్తం చేస్తే అధికార యంత్రాంగం వారిపై వీడియోలు, ఫొటోలు తీసి కేసులు నమోదు చేస్తారు. అలాంటిది అధికార పార్టీకి చెందిన నాయకులు మీటింగ్ నేపంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కల్పిస్తే చూస్తూ నిమ్మకుండి పోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీకి ఒక న్యాయం, విపక్ష పార్టీలు, సాధారణ ప్రజలకు మరో న్యాయమా అంటూ ప్రశ్నిస్తున్నారు. మంగళవారం నాగర్‌కర్నూలు పార్లమెంట్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవి ఎర్రవల్లిలో తోటి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధాన రహదారిపై వాహనాలు స్తంభించడంతో పక్కనున్న సర్వీస్ రోడ్లు కూడా వాహనాలతో నిండిపోయాయి. దీంతో పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు, అత్యవసర అవసరాలపై వెళ్లే వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికార యంత్రాంగం పనితీరుపై పెదవి విరిచారు.

మార్నింగ్ వాక్‌లో మల్లురవి

- పెబ్బేరులో ప్రచారం నిర్వహించిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి

పెబ్బేరులో వాకర్లతో మాట్లాడుతున్న మల్లురవి

పెబ్బేరు, ఏప్రిల్ 16 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి మంగళవారం పెబ్బేరులో మార్నింగ్ వాక్ నిర్వహించారు. అంతకు ముందు రాత్రి ఆయన పెబ్బేరులోనే బస చేసి..ఉదయమే స్థానిక జూరాల క్యాంపు కాలనీలో వాకర్స్‌ను కలుసుకొని ఎన్నికల్లో తనకు ఓటేయాలని అభ్యర్థించారు. కొద్ది సేపు ఫుట్‌బాల్, క్రికెట్, షటిల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. క్రీడాకారులకు ఏమైనా సమస్యలుంటే తీరుస్తానని హామీ ఇచ్చారు. స్థానిక బస్టాండ్ వద్ద టీ, టిఫిన్ సెంటర్ల వద్దకు వెళ్లి యజమానులు, ప్రజలతో మాట్లాడి తనకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. అలాగే అంబేద్కర్‌నగర్‌లో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఎర్రవల్లి రోడ్ షోలో..

ఎర్రవల్లి చౌరస్తా/ మానవపాడు, ఏప్రిల్ 16: మండల కేంద్రంలోని ఎర్రవల్లి చేరస్తాలో మంగళవారం ఎర్రవల్లి మాజీ సర్పంచ్ రవి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్ షోలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లురవి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌తో కలసి పాల్గొన్నారు. రోడ్‌షోలో భాగంగా పార్లమెంట్ అభ్యర్థి మల్లురవి మాట్లాడుతూ.. గద్వాల జిల్లా ప్రజలు తనను అధిక మెజారిటీతో గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మానవపాడు మండల కేంద్రం నుంచి అమరవాయి వరకు ర్యాలీ నిర్వహించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్‌చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

- జెడ్పీవైస్‌చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

పాన్‌గల్, ఏప్రిల్ 16 : గ్రామాల్లో నెలకొన్న ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జెడ్పీ వైస్‌చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మామిళ్ల పల్లి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన అధికారులు, ప్రజాప్రతినిధులతో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం జెడ్పీ వైస్‌చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు పెంచేందుకు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. యువత వృత్తి నైపుణ్యం పెంచుకొని జీవితంలో ఎదగాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ లక్ష్మి, వైస్ ఎంపీపీ కవిత, ఎంపీడీవో కోటేశ్వర్, ఎంపీవో రఘురాములు, డిప్యూటీ తాసీల్దార్ అశోక్ కుమార్, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, వివిధ గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలప్పుడే 'పెబ్బేరు సంత' గుర్తుకొస్తుందా?

- ఎమ్మెల్యేను ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులు

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి

పెబ్బేరు, ఏప్రిల్ 16 : పెబ్బేరు సంత స్థలం వివాదాన్ని ఎన్నికలప్పుడు గుర్తు చేసి ఓట్లు దండుకోవడమే కాంగ్రెస్ పార్టీ నైజంగా కనబడుతోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాములు, పట్టణ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి సంత స్థలంపై, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. తనను గెలిపిస్తే సంతకు సంబంధించి మొత్తం 30.19 ఎకరాల భూమిని పట్టణానికే దక్కేటట్లు చర్యలు తీసుకుంటానని చెప్పారని గుర్తు చేశారు. గెలిచాక మున్సిపాలిటీ తీర్మానం చేసి ఇస్తే చర్యలు తీసుకుంటానంటే..జనవరిలో తీర్మానం చేసి ఎమ్మెల్యేకు అందజేశామన్నారు. ఇంత వరకు పట్టించుకోకుండా ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సంత స్థలం సెంటిమెంట్‌తో మళ్లీ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించడం సమంజసం కాదన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకొని మొత్తం స్థలాన్ని సంతకే అప్పజెప్తే తాము కూడా స్వాగతిస్తామని వారు అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపిబాబు, పార్వతి, పద్మ, నాయకులు సాయినాథ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి

- 242 కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలి
- వనపర్తి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ఎన్నికల నోటిఫికేషన్‌పై రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి, ఏప్రిల్ 16 : ధాన్యం కొనుగోలు చేసిన 24గంటల్లోగా ఆన్‌లైన్‌లో ధాన్యం వివరాలను అప్‌లోడ్ చేసి రైతులకు సకాలంలో డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన 242 ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించాలన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన 24గంటలోగా ట్యాబ్‌లో ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. పంట కొన్న 48గంటల్లో రైతుల అకౌంట్‌లో నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాలోని మిల్లుల నుంచి రావాల్సిన సీఎంఆర్ బియ్యం సకాలంలో అందించే విధంగా డిప్యూటీ తాసీల్దార్లు పర్యవేక్షణ చేయాలన్నారు. మూడు సీజన్లకు సంబంధించి మిల్లర్లు కార్పొరేషన్‌కు అందించాల్సిన 18వేల మెట్రిక్ టన్నులు పెండింగ్ ధాన్యాన్ని ఈ నెల 30 వ తేదీలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో శ్రీనివాసులు, డీఎం ప్రవీణ్, మార్కెటింగ్ అధికారి స్వర్ణసింగ్, డీఆర్డీవో పీడీ , డీటీలు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు అన్ని విధాలా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతపై అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేష్‌తో కలిసి కలెక్టర్ మంగళవారం నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆర్డీవో పద్మావతి, డీఎస్పీ వెంకటేశ్వర్లు , నోడల్ అధికారులు, సీ సెక్షన్ ఎలక్షన్ అధికారులు పాల్గొన్నారు.

రేపు నామినేషన్ల ప్రక్రియ షురూ

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఈనెల 18వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ అభ్యర్థుల నోటిఫికేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 18న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల కోసం రిటర్నింగ్ అధికారి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారని, నామినేషన్లు నాగర్‌కర్నూల్ జిల్లాలో రిటర్నింగ్ అధికారికి అందజేయాలని తెలిపారు. ఏప్రిల్ 25వరకు నామినేషన్ ప్రక్రియ ఉంటుందని నామినేషన్ వేయాలనుకునే అభ్యర్థులు నేరుగా రిటర్నింగ్ అధికారి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు హార్డ్ కాపీలను రిటర్నింగ్ అధికారికి అందజేయాలన్నారు ప్రచార అనుమతులు సహాయ రిటర్నింగ్ అధికారి నుంచి పొందాలన్నారు. జిల్లాలో ఎన్నికలు పారదర్శకంగా ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.నగేశ్, ఆర్డీవో పద్మావతి, రాజకీయ పార్టీ ప్రతినిధులు వేణాచారి, త్రినాథ్, వెంకటేశ్వర్‌రెడ్డి, కుమారస్వామి, సయ్యద్‌జమిల్, పరమేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతు పనుల్లో వేగం పెంచాలి

- జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

గద్వాల, ఏప్రిల్ 16 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అవసరమైన మరమ్మతు పనుల్లో వేగం పెంచి జూన్ మొదటివారంలో పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టాల్సిన పనులపై సంబంధిత శాఖ అధికారులతో మండలాల వారీగా మంగళవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన 460 ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు చదువుకునే విధంగా చేపట్టాల్సిన సుందరీకరణ పనులను వెంటనే చేపట్టి జూన్ మొదటి వారంలో పూర్తి చేయాలన్నారు. ఇందులో 160 పాఠశాలలు మన ఊరు-మన బడి కింద చేపట్టాల్సిన పనులు ఉన్నాయని వాటిని కూడా పూర్తి చేయాలన్నారు.ఇప్పటికే అన్ని పాఠశాలల్లో కమిటీలను ఏర్పాటు చేశారని, అవసరమైన పనులను గ్రౌండింగ్ చేసినట్లు కలెక్టర్ చెప్పారు.ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల మరమ్మతులు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం లాంటి మౌలిక వసతుల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తి చేసిన పనులకు అవసరమైన నిధులు వెంటనే మంజూరు చేస్తామని తెలిపారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన సమయంలో పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో నర్సింగరావు, పంచాయతీ రాజ్ ఈఈ విజయ్‌కుమార్, మిషన్‌భగీరథ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అధికారులు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలి

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంతోష్ సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరాపై మున్సిపల్ కమిషనర్లు, మిషన్‌భగీరథ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే రెండు నెలల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండి నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఉండాలని ఆదేశించారు. ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరం మేరకు అధికారులు స్థానికంగా ఉండి హ్యాండ్ పంపులు, బోరుమోటర్లను మరమ్మతులు చేయించి నీటిని వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌పై చేపట్టిన వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ మిషన్ భగీరథ అధికారులు భుమేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా విచారించాలి: ఎస్పీ

గద్వాల అర్బన్, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల కోడ్‌లో భాగంగా జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో మద్యం, నగదు అక్రమ రవాణాపై నిఘా ఉంచాలని, ఆయా పోలీస్ స్టేషన్‌ల్లో నమోదైన ప్రతి కేసుల్లో సాక్ష్యాలను సేకరించి పకడ్బందీగా విచారణ చేపట్టాలని ఎస్పీ రితిరాజ్ పోలీస్ అధికారులను అదేశించారు. జిల్లాకేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో మంగళవారం నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసుల విచారణలో అవసరమైన ప్రతి సాక్ష్యాన్ని సేకరించాలన్నారు. జిల్లాలో సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పెంచి ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని అదేశించారు. సమీక్షా సమావేశంలో డీఎస్పీ సత్యనారాయణ, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ సత్తయ్య, గద్వాల, అలంపూర్, శాంతినగర్ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

26 కొత్త బస్సులు మంజూరు చేయాలి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 16 : వనపర్తి ఆర్టీసీ డిపోకు 26 కొత్త బస్సులు మంజూరు చేయాలని మంగళవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి కోరారు. హైదరాబాద్‌లో ఆయన సజ్జనార్‌తో కలిసి పలు అంశాలపై మాట్లాడారు. పాత బస్టాండ్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి వాణిజ్యపరంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని చిన్నారెడ్డి ఎండీని కోరారు. దీనిపై ఎండీ సానుకూలంగా స్పందించినట్లు చిన్నారెడ్డి తెలిపారు.

తాగునీటి సమస్యలు రావొద్దు

మల్దకల్, ఏప్రిల్ 16 : మండలకేంద్రంతోపాటు మిగతా గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని సీఈవో కాంతమ్మ అన్నారు. మంగళవారం మల్దకల్, తాటికుంట గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ ఆరెంజ్ జోన్ పరిధిలోని గ్రామాలు మల్దకల్, తాటికుంట, మద్దెలబండ, పెద్దొడ్డి, కుర్తిరావుల చెర్వు, నాగర్‌దొడ్డి, వీరలాపురం, మల్లెందొడ్డి, ఎల్కూర్, చర్లగార్లపాడు, నీలిపల్లి గ్రామాలు ఉన్నాయన్నారు. ఈ గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా పాత బోర్లను మరమ్మతులు చేయించాలని అవసరమైతే కొత్త బోర్లను వేసి తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో, కార్యదర్శులకు సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో హరికృష్ణ, ఎంపీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ నరసన్న, సీనియర్ అసిస్టెంట్ సూర్యప్రకాశ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్ పట్టివేత: కేసు నమోదు

అలంపూర్, ఏప్రిల్ 16: ఎర్రవల్లి మండలం కొండపేటలో 40 కిలోల సీహెచ్‌ను మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నట్లు అలంపూర్ అబ్కారీ సీఐ హన్మనాయక్ తెలిపారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కల్లు దుకాణంపై దాడులు నిర్వహించి 234 లీటర్ల కల్లును ధ్వంసం చేశారు. నిర్వాకులైన వెంకటేశ్‌గౌడ్, రజినీబాబుగౌడ్‌ను అదుపులోకి తీసుకుని తాసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలకృష్ణారెడ్డి, ఎస్సై నాగరాజుగౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేవుడి పేరుతో ఓట్లడగడం సిగ్గుచేటు

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

కొత్తకోట, ఏప్రిల్ 16 : దేవుడి పేరుతో బీజేపీ ఓట్లు అడగటం సిగ్గుచేటని మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం కొత్తకోట పట్టణంలో కొత్తకోటతో పాటు మదనాపురం మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టడం బీజేపీకి అలవాటని ఎద్దేవా చేశారు. దేవుళ్లను రోడ్డుపైకి తెచ్చి రాజకీయం చేయడం బీజేపీకి అలవాటుగా మారిందని, దేవుని ఇంట్లో పెట్టుకుని పూజించుకోవాలన్నారు. సమావేశంలో ప్రశాంత్, కృష్ణారెడ్డి, వేముల శ్రీనివాస్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, పీజే బాబు, బాల్‌నారాయణ, నాగన్నయాదవ్, జగదీశ్వర్, బోయేజ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

ప్రజా చైతన్య కెరటం గద్దర్

వనపర్తి టౌన్, ఏప్రిల్ 16 : ప్రజా చైతన్య కెరటం గద్దర్ అని ప్రముఖ వైద్యుడు మురళీధర్ అన్నారు. సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ప్రజా వాగ్గేయకారుడు స్వర్గీయ గద్దర్ స్మారక సంచిక సాంగ్ మార్చ్ పుస్తక పరిచయ సభను మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గద్దర్ తన జీవిత కాలమంతా ప్రజా సమస్యలపై పాటను ఆయుధంగా చేసుకొని పోరాడారని, ప్రజల్లో చైతన్యాన్ని రగిలించారని అన్నారు. కార్యక్రమంలో సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, కవి జనజ్వాల , వనపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌కుమార్‌యాదవ్, ఆర్‌డీఎస్ సంస్థ నిర్వాహకులు చిన్నమ్మా థామస్, కందూరు నారాయణరెడ్డి, బండారు శ్రీనివాస్, మల్యాల బాలస్వామి, గంధం నాగరాజు, బత్తుల శ్రీనివాసులు, రాజారాంప్రకాశ్, ఖమర్ రెహ్మాన్, సత్తార్, తూర్పింటి నరేశ్‌కుమార్, ఉప్పరి తిరుమలేశ్, శాంతన్న, పావనం చంద్రశేఖర్, ప్రవీణ్‌కుమార్, స్వామి, శ్రీలక్ష్మి ఉన్నారు.

గద్దర్ స్మారక సంచిక సాంగ్ మార్చ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నర్సింగ్ హోమ్‌ల తనిఖీ

వనపర్తి, ఏప్రిల్ 16 : కలెక్టర్ ఆదేశాలనుసారం జిల్లాలోని పలు ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లోని వసతులు, చేపట్టుతున్న వైద్య సేవలపై తనిఖీ చేసినట్లు డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రవేట్ నర్సింగ్ హోమ్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుధా నర్సింగ్ హోమ్‌లో సిజేరియన్లు 10, నార్మల్ 8 కాగా సృష్టి దవాఖానలో సిజేరియన్ 33, నార్మల్ 23 చేసినట్లు రికార్డులో పేర్కొన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర స్థాయి వ్యాధి నిరోధక టీకాల బృందం మంగళవారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం, గోపాల్ పేట్ పీహెచ్‌సీ సందిర్శించారు. అంతకుముందు డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్ కలిశారు. అనంతరం వ్యాధి నిరోధక టీకాలపై ఆరా తీశారు.

నల్ల చెరువులో వ్యక్తి గల్లంతు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 16: జిల్లా కేంద్రంలోని నల్ల చెరువులో వ్యక్తి గల్లంతైన ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు కథనం ప్రకారం వనపర్తి పట్టణంలోని రాయిగడ్డకు చెందిన తెలుగు బోలమోని బలరాముడు, కృష్ణ సోదరులు, వారి బావ భీముడుతో కలిసి నల్ల చెరువులోకి వెళ్లి నీటిలోకి దిగారు. అందులో బలరాముడు, భీముడు గట్టుకు చేరుకోగా కృష్ణ మాత్రం నీటిలోనే ఉన్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు కృష్ణ ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. కృష్ణ భార్య ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై రామరాజు తెలిపారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

గద్వాల అర్బన్, ఏప్రిల్ 16 : సారా విక్రయించినా, సరఫరా చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ, కర్ణాటక ఎక్సైజ్ శాఖ పోలీసులు రెండు రాష్ట్రాల మధ్య ఉన్న పలు తండాల్లో మెరుపు దాడులు నిర్వహించారు. కేటీదొడ్డి మండలంలోని వాగుతండా,పూజారితండా, తూర్పుతండాల్లో తనిఖీలు నిర్వహించగా 5లీటర్ల సారా, 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి రెండు కేసులు నమోదు చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. అదే విధంగా కర్ణాటక రాష్ట్రంలోని సింగనేడి తండాలో 2లీటర్ల సారా, 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ గణపతి రెడ్డి, టాస్క్‌ఫోర్స్ సీఐ సైదిరెడ్డి, కర్ణాటక, తెలంగాణ ఎక్సైజ్ పోలీసులు ఉన్నారు.

కొడుకు, భార్యలేదని ఆత్మహత్య

కొత్తకోట, ఏప్రిల్ 16 : భార్య, కొడుకు రోడ్డు ప్రమాదంలో రెండునెలల కిందట మృతి చెందడంతో తీవ్ర మనస్తాపానికి గురైన భర్త ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం కొత్తకోట పట్టణానికి చెందిన కుమ్మరి తిరుపతయ్య మొదటి కుమారుడు కృష్ణ(35) మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. ఈ ఏడాది జనవరి 26వ తేదీన షిర్డీకి కారులో వెళ్తున్న క్రమంలో ముందు అగి ఉన్న కంటైనర్‌ను ఢీకొట్టడంతో కృష్ణ భార్య వసుధ, కూమారుడు శ్రీమన్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో అప్పటి నుంచి కృష్ణ జీవితంపై విరక్తి చెంది బాధపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పాత చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి ప్రైవేట్ దవాఖానకు తరలించే లోపే అప్పటికే మృతి చెందాడు.

కృష్ణ (ఫైల్)

రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు

అయిజ, ఏప్రిల్ 16: పౌరసరఫరాల శాఖ ద్వారా లబ్ధిదారులకు అందజేస్తున్న రేషన్ బియ్యాన్ని బ్లా